


దర్గాగా మొరం అక్రమ రవాణా.. 2



ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## బైక్‌పై 'లడఖ్–ఉమ్లింగ్‌లా' అధిరోహించిన ఇందూరు కుర్రోడు సుశాంత్




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇందూరు కుర్రోడు సుశాంత్ గిన్నిస్ బుక్ ఆప్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. బైక్‌పై లడఖ్, ఉమ్లింగ్‌లాను అధిరోహించిన మొదటి మోటోవ్లాగర్‌గా చరిత్రకెక్కాడు. సుశాంత్ బైక్‌పై నిజామాబాద్ నుంచి లడఖ్ వరకు రౌండ్ ట్రిప్ పూర్తి చేసిన మొదటి డాక్యుమెంటెడ్ మోటో వ్లాగర్‌గా నిలిచాడు. ఇందులో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటారబుల్ పాస్ ఉమ్లింగ్ లా (19,024 అడుగులు)ను అధిరోహించాడు. ప్రయాణంలో భాగంగా 7,316 కి.మీ (రౌండ్ ట్రిప్)లను పూర్తి చేశాడు.



## భగలాముఖి పీఠంలో అమ్మవారి మాస అష్టమి పూజలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని భగలాముఖి పీఠంలో ఆదివారం అష్టమిని పురస్కరించుకుని భగలాముఖి అమ్మవారి మాస జన్మదిన అష్టమిని నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. చింతామణి గణపతి పూజతో పాటు గోత్రనామాలతో విశేష సంకల్పం నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి శుద్ధోదక జలాభిషేకం, ఆవుపాలతో క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పసుపుతో హరిద్రాభిషేకం, కొబ్బరి నీళ్లతో నారికేల జలాభిషేకాలు చేశారు. అలాగే భక్తులు దేవీదేవతల నామ పారాయణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన పట్టు వస్త్ర సమర్పణతో పాటు వివిధ రకాల ఫలాలు, స్వీట్లతో నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి క్రాంతి పటేల్, ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.

జిల్లా పోలీసులు డ్రంకన్ డ్రైవ్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం ప్రత్యేక తనిఖీలు చేపట్టి మందుబాబుల ఆట కట్టిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఘటనల్లో ప్రతి యేటా ఎంతో మంది చనిపోతున్నారు. దీంతో పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటున్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ఇటీవల విస్తృతంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ నెల 19వ తేదీ నుంచి 26 తనిఖీలు చేపట్టారు. వారం రోజుల్లో 129 కేసులు నమోదు చేశారు. 129 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం కోర్టులో ప్రవేశపెట్టారు. వీరిలో 10మందికి కోర్టులు వారం రోజుల పాటు జైలుశిక్ష విధించాయి. అలాగే 129మందికి మొత్తం రూ.8.80 లక్షలు జరిమానా విధించాయి.

- అక్షరటుడే, నిజామాబాద్ సిటీ




# తాగి నడిపితే అంతే!

■ నిజామాబాద్ జిల్లాలో జోరుగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు ■ వారం రోజుల్లో 129 కేసులు నమోదు ■ జైలు శిక్షతో పాటు భారీగా జరిమానాలు

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో గతంలో ఒకటి, రెండు రోజులు జైలు శిక్ష విధించేవారు. జరిమానా సైతం తక్కువగా ఉండేది. అయితే ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం ప్రకారం మద్యం తాగి వాహనాలు నడుపుతూ దొరికితే జేబులకు చిల్లు పడుతోంది. వారం రోజుల వరకు జైలు శిక్ష విధిస్తున్నారు. అంతేగాకుండా రూ.10 వేల ఫైన్ వేస్తున్నారు. అయినా కూడా మందుబాబుల్లో మార్పు రావడం లేదు. దీంతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి మందుబాబుల పని పడుతున్నారు.

### న్యూ ఇయర్ నేపథ్యంలో..

జిల్లాలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇప్పటి నుంచే ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే న్యూ ఇయర్ అంటేనే మందు ఏరులై పారుతోంది. భారీగా మద్యం విక్రయాలు సాగుతాయి. చాలా మంది యువత తాగి రోడ్లపై హంగామా చేస్తారు. ఈ క్రమంలో పోలీసులు డిసెంబర్ 31న అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే కొత్త సంవత్సరం సమీపిస్తుండంతో నిత్యం తనిఖీలు కొనసాగుతున్నాయి. అయితే 31న రాత్రి ప్రత్యేక బృందాలతో డ్రంకన్ డ్రైవ్ చెకింగ్ చేపట్టనున్నారు. ఒకవేళ మద్యం తాగి వాహనాలు నడుపుతూ దొరికితే కఠిన చర్యలు తీసుకోనున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ క్యాన్సిల్ చేసే అవకాశం కూడా ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.




## పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రభుత్వం పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పీఆర్సీ సమయం రెండేళ్లు పూర్తయిందని ఆయన పేర్కొన్నారు. గతంలో ప్రకటించిన విధంగా ఈనెల నుంచి ఇస్తామన్న డీఏను వెంటనే ఇవ్వాలన్నారు. అలాగే ఉపాధ్యాయులకు అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. డైట్, జూనియర్ లెక్చరర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ధర్మేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మహేశ్వర్, యాదగిరి, చంద్రశేఖర్, రత్నాకర్, ప్రకాష్, సురేష్, సాయి తేజ, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



## 11న మున్నూరు కాపు సర్పంచ్‌లకు ఘనసన్మానం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన మున్నూరు కాపు సర్పంచ్‌లను జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ పేర్కొన్నారు. నగరంలోని ప్రగతి నగర్ మున్నూరు కాపు కల్యాణ మండపంలో వచ్చే నెల 11న ఆదివారం ఉదయం 12 గంటలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జిల్లాలో 67 మంది మున్నూరు కాపు సర్పంచ్‌లు విజయం సాధించారని చెప్పారు. 60 మంది ఉప సర్పంచ్‌లుగా, వందలాది మంది వార్డు మెంబర్లుగా గెలిచారని పేర్కొన్నారు. మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ఆకుల రమేష్, బంటు బాలవర్ధి, దారం సాయిలు, ఆకుల చిన్న రాజేశ్వర్, ఆకుల రాఘవేందర్ పాల్గొన్నారు.



## కూచిపూడిలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన కామారెడ్డి విద్యార్థులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 4,608 మంది కళాకారులు 40 నిమిషాల పాటు కూచిపూడి నృత్యం చేసి గిన్నిస్ రికార్డు నెలకొల్పారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం 2 పేరిట ఈ ప్రదర్శనలు చేపట్టారు. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి వచ్చిన కళాకారులు ఉత్సాహంగా నాట్యం చేశారు. ఈ అకాడమీ ఆధ్వర్యంలో 2023లో 4,218 మంది విద్యార్థులతో ఈ ప్రదర్శనలను గిన్నిస్ రికార్డులోకి ఎక్కగా.. తాజాగా ఆ రికార్డును ఈ ఏడాది వారే అధిగమించారు. కామారెడ్డి పట్టణానికి చెందిన కూచిపూడి కళాక్షేత్రం నుంచి 30 మంది కళాకారులు ఈ నాట్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రముఖ నాట్య కళాకారిణి తార ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని కామారెడ్డికి గిన్నిస్ బుక్ రికార్డును తీసుకువచ్చారు. ఈ మేరకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతినిధి స్వప్నిల్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని వైద్యుడు మహేష్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 310మంది రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యుడు మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. శిబిరం ఏర్పాటు చేసిన మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డికి గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.





## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై బొజ్జ మహేష్ కుమార్ అన్నారు. ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు నూతన సంవత్సర వేడుకలపై పోలీసులు ఫోకస్ పెట్టారు. పట్టణ కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఆదివారం వాహనాల తనిఖీతో పాటు డ్రంక్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు పాటించిన వారికి భారీ జరిమానాలు, జైలుశిక్షలు తప్పవని హెచ్చరించారు. ఎల్లారెడ్డితో పాటు పరిసర ప్రాంత ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎప్పటిలాగే అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అనుమతి పత్రాలు, లైసెన్స్ తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు.



## బీఆర్ఎస్ సర్పంచ్‌లకు సన్మానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలో పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదివారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడతూ.. గ్రామాల్లో ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటూ బీఆర్ఎస్ మద్దతదారులను గెలిపించడం అభినందనీయమన్నారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇదేవిధంగా రానున్న అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అనుమతి లేని కొత్త సంవత్సర వేడుకలపై నిషేధం: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహించే కొత్త సంవత్సర వేడుకలు నిషేధమని ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. డీజేలు, పటాకులకు అనుమతి లేదని వెల్లడించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం, అధిక వేగంతో ప్రయాణించడం, నిర్లక్ష్యంగా ప్రవర్తించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పిల్లలు, పెద్దలు అందరూ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇళ్లలోనే నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం ఆనందంగా ప్రారంభం కావాలి తప్పా.. నిర్లక్ష్యం కారణంగా విషాదంగా మారకూడదన్నారు. డిసెంబర్ 31 రాత్రి 8 గంటల నుంచి జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉంటుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తుందని ఆయన వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి, మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన కూడళ్లలో ప్రత్యేక పోలీస్ బృందాలు వాహనాల తనిఖీలు నిర్వహిస్తాయని ఎస్పీ తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎక్కడా న్యూ ఇయర్ కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఫామ్ హౌస్‌లు, క్లబ్బులు, గేటెడ్ కమ్యూనిటీలలో అనుమతి లేకుండా వేడుకలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు భయాందోళన కలిగించే క్రాకర్స్, టపాసులు, అధిక శబ్దం కలిగిన డీజేలు, ఆర్కెస్ట్రా సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై పూర్తిగా నిషేధం ఉందన్నారు నిషేధిత డ్రగ్స్, గంజా వంటి మత్తు పదార్థాల విక్రయం, వినియోగానికి పాల్పడితే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## కేసీఆర్ అంత నమ్మకద్రోహి తెలంగాణలోనే లేరు: ఎంపీ అర్వింద్



**అక్షరటుడే, ఇందూరు:** కేసీఆర్ అంత నమ్మకద్రోహి తెలంగాణలోనే లేరని ఎంపీ అర్వింద్ విమర్శించారు. తెలంగాణ సమాజం నమ్మకాన్ని వమ్ము చేసిన వ్యక్తి కేసీఆర్ అని దుయ్యబట్టారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్‌లుగా గెలిచిన బీజేపీ మద్దతుదారులకు నగర శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ.. మొత్తంగా 96 మంది సర్పంచ్‌లు.. పార్లమెంట్ పరిధిలో గెలవడం అద్భుతమన్నారు. రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోచుకుందని ఆరోపించారు. ఆ కుటుంబానికి రాష్ట్రంలో మాట్లాడే అర్హత లేదన్నారు. కేటీఆర్, హరీష్‌రావు గురించి కవితనే బహిరంగంగా ఆరోపణలు చేస్తుంటే ఇంకా ఏం ముఖం పెట్టుకుని కేటీఆర్ మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, గ్రామ పరిపాలన వ్యవస్థను కేసీఆర్ కుటుంబం నాశనం చేసిందన్నారు. కూలిపోయే డ్యామ్‌లు కట్టి ఇవాళ పెద్దాయన బయటకు వచ్చి సూక్తులు చెబుతున్నారన్నారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి ప్యాకేజీలకు అమ్ముడుపోవద్దన్నారు. ప్రజాగ్రహానికి గురైతే ఎలా ఉంటుందో ఈరోజు ఓ ఎమ్మెల్సీని చూస్తే తెలుస్తోందని ఎంపీ అర్వింద్ అన్నారు. ప్రజలకు ఆగ్రహం కలిగితే ఎంతటి వారైనా రాజకీయంగా భూగర్భంలో కలిసిపోవాల్సిందేనన్నారు. ఉన్న ఊరు కన్నతల్లితో సమానం.. అలాంటి ఊరుకు సేవ చేసుకునే అవకాశం సర్పంచ్‌లకు ఉందన్నారు. గ్రామాలకు సర్పంచ్‌లే ముఖ్యమంత్రులని.. వారికి సర్వాధికారాలు ఉన్నాయని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. ఏ సీఎంతోనూ అవసరం లేదన్నారు. పారదర్శకంగా అవినీతి లేకుండా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. 12వేల గ్రామ పంచాయతీలుండగా.. వచ్చేసారి 98శాతం పంచాయతీల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చాన్నాళ్ల తర్వాత మాజీ సీఎం కేసీఆర్ బయటకు వచ్చి ప్రెస్‌మీట్ పెట్టాడని.. అందులో ఆసాంతం చాదస్తం.. వైరాగ్యమే కనిపించిందని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి తెలంగాణను ఎలా నాశనం చేశారో చెప్తాడని అనుకుంటే పాతా పురాణమంతా చెప్పుకొచ్చాడని ఎద్దేవా చేశారు. జిల్లాలో 280మంది బీజేపీ మద్దతుదారులు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేశారని బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పేర్కొన్నారు. అందులో 76 సర్పంచ్‌లు గెలిచారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు డబ్బులతో సర్పంచ్ ఎన్నికల్లో గెలిచారన్నారు. ఈ ఎన్నికలు బీజేపీ విజయాలకు ప్రారంభం మాత్రమేనని.. రాబోయే రోజుల్లో మరికొంత మంది ఎంపీటీసీ, జడ్పీటీసీలు, కౌన్సిలర్లుగా గెలువబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సర్పంచ్ తమ గ్రామాన్ని ఆదర్శమైన పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ఓడిపోయిన వారు ఎలాంటి నిరాశ నిస్పృహలకు లోను కావద్దన్నారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. సర్పంచ్‌లుగా గెలిచిన వారికి ఎలాంటి ఇబ్బంది ఎదురైనా బీజేపీ ఎమ్మెల్యేలు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాదగిరిబాబు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ‘మన్ కీ బాత్’ను వీక్షించిన బీజేపీ నాయకులు



**అక్షరటుడే, ఆర్మూర్:** బీజేపీ ఆర్మూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పీఎం నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం వీక్షించారు. పట్టణంలోని 13వ వార్డు 69వ బూత్ అరుంధతి నగర్‌లో దళిత మోర్చా అధ్యక్షుడు వెంచిర్యాల భాస్కర్ నివాసంలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భూపతిరెడ్డి, ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, నూతల శ్రీనివాస్ రెడ్డి, అనిల్, సుంకరి రంగన్న, పిట్ల శ్రీధర్, మూర్తి, బీజేవైఎం అధ్యక్షుడు ఉదయ గౌడ్, ఉపాధ్యక్షులు పెద్దల భరత్, మనీ తదితరులు పాల్గొన్నారు.



## వేంపల్లి దేవాలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని వేంపల్లి లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం ఉత్తర ద్వార దర్శనం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ బొత్తమొల్ల నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## రాష్ట్రస్థాయి అర్చరీ పోటీల్లో దీపిక ప్రతిభ



**అక్షరటుడే, బాన్సు-వాడ:** మండలంలోని తిర్మలాపూర్ క్యాంప్ కొత్తబాది ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎం.దీపిక జాతీయస్థాయి అర్చరీ పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయి అర్చరీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రతినిధులు పేర్కొన్నారు. నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అర్చరీ పోటీల్లో దీపిక ప్రదర్శనతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జనవరి 4 నుంచి 8వ తేదీ వరకు జార్ఖండ్‌లోని రాంచిలో జరిగే జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో పాల్గొననుంది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దీపికకు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేస్తూ, జాతీయ స్థాయిలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలకు పేరు తేవాలని సూచించారు.

మొరం అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.. గుట్టలు కనిపిస్తే మాయం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆదివారం వస్తే చాలు.. మొరం అక్రమ రవాణా దర్జాగా చేపడుతున్నారు. ప్రకృతి వనరులను కొల్లగొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. సండే సెలవు కావడంతో జోరుగా రవాణా సాగుతోంది. వేబిల్లుల ఊసే లేకుండా పగలు రాత్రి ఇష్టారాజ్యంగా మొరాన్ని తరలించి అందినకాడికి దండుకుంటున్నారు.

- అక్షరటుడే, కోటగిరి



# దర్జాగా మొరం అక్రమ రవాణా..

■ చేతన్‌నగర్ గ్రామంలో దందా ■ అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు ■ మొరం తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

పోతంగల్ మండలంలో మొరం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పగలు రాత్రి తేడా లేకుండా అక్రమార్కులు మొరం దందా చేస్తున్నారు. ముఖ్యంగా కిందిస్థాయి సిబ్బంది ప్రోద్బలంతో దర్జాగా ఈ రవాణా సాగుతోందని తెలుస్తోంది. ఈ రవాణా కారణంగా రోడ్లు ఛిద్రమవుతున్నప్పటికీ పట్టించుకోవట్లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పోతంగల్ మండలంలో..**

మండలంలోని చేతన్‌నగర్ గ్రామంలో ఆదివారం అధికారులకు సెలవు ఉంటుందనే సాకుతో బహిరంగంగానే మొరం తవ్వకాలు చేపట్టారు. ట్రాక్టర్లలో, టిప్పర్లలో మొరాన్ని ఇతర ప్రాంతాలకు తరలించారు. అయితే మొరం తరలింపుపై గ్రామస్తులు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు స్పందించి గ్రామానికి వెళ్లి మొరం అక్రమ రవాణాను నిలిపివేశారు. అక్రమ మొరం దందాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: యూత్ కాంగ్రెస్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్ పేర్కొన్నారు. నగరంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఇటీవల సర్పంచ్‌లుగా గెలిచిన యూత్ కాంగ్రెస్ నాయకులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. యూత్ కాంగ్రెస్ శ్రేణులు క్రమశిక్షణతో పని చేయాలి.. అదే వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని విపుల్‌గౌడ్ సూచించారు. రాహుల్ గాంధీ ఆలోచనల అనుగుణంగా పనిచేసి రాబోయే పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ నిర్దేశించిన అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు, నరేందర్ గౌడ్, రాజు గౌడ్, ఆదిత్య, జిఅబ్బోల్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఆత్మపరిశీలన చేసుకోవాలి



**అక్షరటుడే, గాంధారి:** మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌రెడ్డి తాను చేసిన వ్యాఖ్యలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని ముదెల్లి గ్రామ మాజీ సర్పంచ్ కాగుల మోహన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజిత్ ఒకవేళ బీఆర్ఎస్ కార్యకర్త అయితే వెంటనే అతడికి రూ.2లక్షలు బీమా చేయించాలని.. లేదా పార్టీ తరపున మీరు ఇచ్చినా బాగుంటుందని ఆయన పేర్కొన్నారు. గుండాలు, రౌడీలు అంటూ నాయకులను దూషించడం ఆయనకే చెల్లిందన్నారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రం, నియోజకవర్గం ఎంతగా అభివృద్ధి జరిగిందో అందరికీ తెలిసిందేనన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు షాదాబ్‌తో కలిసి సుమారు 150 మంది బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా పలువురు కార్యకర్తలు పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో ఖదీర్, అమీర్, షోయబ్, మజార్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, పంచారెడ్డి చరణ్, రిజ్వాన్, హుస్సేన్, జాఫర్, ఆషాబీ, అన్వర్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హసాకొత్తూరు విద్యార్థిని



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని హసాకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రోషిణి అండర్-14 హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అరుణశ్రీ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రోషిణిని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. మహబూబ్ నగర్ జిల్లా నారాయణపేటలో 29, 30వ తేదీల్లో జరగబోయే క్రీడల్లో రోషిణి రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రోషిణి ఎంపికలో కీలకపాత్ర పోషించిన ఫిజికల్ డైరెక్టర్ మాధురిని అభినందించారు.



## హౌసింగ్ బోర్డులో క్యాలెండర్ ఆవిష్కరణ

**అక్షరటుడే, ఆర్మూర్:** స్ఫూర్తి సేవ సొసైటీ ఆర్మూర్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం కాలనీలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సేవ సొసైటీ యూత్ సభ్యులు ఆనంద్, నర్సయ్య, నరసింహులు, అశోక్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



## రాంనగర్ సర్పంచ్‌కు సన్మానం

**అక్షరటడే, ఇందూరు:** రాంనగర్ సర్పంచ్‌గా అంశాల స్వామి విజయం సాధించారు. ఈ మేరకు ఆదివారం స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు పల్లపు అంజి, మహేష్, మోహన్, శీను, రాజు, శివ, నిఖిల్, శ్రావణ్, నాగరాజు, సాయినాథ్ పాల్గొన్నారు.



నిజామాబాద్ పార్టీ కార్యాలయంలో..



ఆర్మూర్‌లో..



మెండోరాలో ..



భీమ్‌గల్‌లో..

## ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కాంగ్రెస్ జెండాలను ఎగురవేశారు. అనంతరం ఉపాధిహామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు మార్చడాన్ని నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్




ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



ఆలూర్ మండల కేంద్రంలో..



ముప్కాల్‌లో..



కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..



గాంధారి మండల కేంద్రంలో..



బాన్సువాడలోని వర్ని రోడ్డులో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు